
# హుజూరాబాద్ గడ్డ.. గులాబీ అడ్డా



హుజూరాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఆయన సతీమణి శాలినిరెడ్డి, కూతురు శ్రీనికారెడ్డి

హుజూరాబాద్, డిసెంబర్ 4: తెలంగాణ ఉద్యమం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు హుజూరాబాద్ గడ్డ గులాబీ పార్టీ అడ్డాగా నిలుస్తున్నది. రెండేండ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నిల్లో మినహా నాటి నుంచి నేటి వరకు ఈ నియోజకవర్గ ప్రజలు కారు పార్టీకే జైకొడుతున్నారు. ఉత్కంఠ భరితంగా కొనసాగిన ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌కే అండగా నిలిచారు. 2001లో జరిగిన పరిషత్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయదుందుభి మోగించి తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోశారు. అప్పటి నియోజకవర్గంలోని హుజూరాబాద్, ఎల్కతుర్తి, సైదాపూర్, భీమదేవరపల్లి మొత్తం నాలుగు జడ్పీటీసీలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకున్నది. ఆదే ఏడాది జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో సర్పంచులను బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి ఉద్యమకాంక్షను చాటారు. 2004 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కారు గుర్తుపై కెప్టెన్ లక్ష్మీకాంతారావు పోటీ చేసి గెలిచి మంత్రి పదవి చేపట్టాడు. అప్పుడు కాంగ్రెస్, టీఆర్‌ఎస్ పొత్తులో భాగంగా హుజూరాబాద్ టికెట్‌ను బీఆర్‌ఎస్‌కు కేటాయించగా లక్ష్మీకాంతారావుకు ప్రజలు పట్టం కట్టి ఉద్యమకాంక్షను చాటారు. 2004లో కాంగ్రెస్‌లో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యమాన్ని అణచివేసేందుకు అప్పటి సీఎం వైఎస్ఆర్ చేసిన ప్రయత్నం లేదు. అయితే 2006లో జరిగిన పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో కూడా దాదాపు సగం స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను ప్రజలు గెలిపించి హుజూరాబాద్ గడ్డ ఎప్పుడూ గులాబీదేనని చాటి చెప్పారు. ఆ తర్వాత ఉద్యమకాంక్ష తెలిపేందుకు 2008 జరిగిన ఉప ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్ తరపున బరిలోఉన్న లక్ష్మీకాంతారావును గెలిపించి ఉద్యమతీవ్రతను రాష్ర్టానికి ఇక్కడి ప్రజలు చాటిచెప్పారు. పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పడ్డ హుజూరాబాద్ నియోజకవర్గంలో 2009 లో బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసిన ఈటల రాజేందర్‌ను అప్పుడు కాంగ్రెస్ పవనాలు వీచినప్పటికి ప్రజలు అండగా నిలిచారు. 2010లో తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిల్చిన ఉప ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసిన ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించి ఉద్యమ సవాల్ విసిరారు. ఆ సమయంలో కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్ దక్కలేదు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జరిగిన 2014 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసిన ఈటల రాజేందర్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డిపై భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో ప్రత్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిపై 43వేల 719 ఓట్ల మెజార్టీతో బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసిన రాజేందర్ మరోసారి విజయకేతనం ఎగురవేశాడు. 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన ఈటల రాజేందర్‌కు సానుభూతి పవనాలు వీచినప్పటికి బీఆర్‌ఎస్‌కు 85 వేల పైచిలుకు ఓట్లు రావడం విశేషం. చంపుకొంటారో సాదుకుంటరో వంటి సెంటిమెంట్ డైలాగులు కొట్టి ఈటల రాజేందర్ గెలిచినట్లు రాజకీయ విశ్లేషకులు భావించారు. ఈ ఎన్నికల్లో పాడి కౌశిక్‌రెడ్డి బీఆర్‌ఎస్ తరపున పోటీచేసి విజయఢంకా మోగించారు. ఆది నుంచి పరిశీలిస్తే హుజూరాబాద్ అడ్డా బీఆర్‌ఎస్ అడ్డానేనని మరోసారి రుజువైంది.

### కేసీఆర్‌కు ధ్రువీకరణ పత్రం అందించిన పాడి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్4: శాసన సభ ఎన్నికల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన బీఆర్‌ఎస్ నాయకుడు పాడి కౌశిక్‌రెడ్డి సోమవారం రాత్రి బీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షుడు, కే చంద్రశేఖర్‌రావును తన నివాసంలో కలిసి ఎమ్మెల్యే ధ్రువీకరణ పత్రం అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల జమ్మికుంటకు వచ్చిన కేసీఆర్ ప్రచారంలో కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి తనకు గిఫ్టుగా ఇవ్వాలని కేసీఆర్ కోరగా, దానికి ఓటర్లు పెద్దఎత్తున సరేనంటూ నినదించారు. ఆదివారం వెల్లడైన ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై గెలువడంతో ఎమ్మెల్యే ధ్రువీకరణ పత్రాన్ని ఆర్‌వో నుంచి అందుకొని, నేరుగా కేసీఆర్‌కు గిఫ్ట్ గా అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా, ఆయన సతీమణి శాలినిరెడ్డి, కూతురు శ్రీనికారెడ్డిని కేసీఆర్ ఆశీర్వదించారు. భవిష్యత్‌లో శ్రీనికరెడ్డికి మంచి అవకాశాలు వస్తాయని, చక్కగా చదువుకొని తండ్రి అడుగుజాడల్లో నడవాలని కేసీఆర్ సూచించారు.

# కొండగట్టు, ధర్మపురిలో పూజలు



ధర్మపురి: గండదీపంలో నూనె పోస్తున్న కరీంనగర్ జిల్లా కలెక్టర్ ప్రమీల సత్పతి

మల్యాల/ధర్మపురి, డిసెంబర్ 4: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో, ధర్మపురి లక్ష్మీ నర్సింహ స్వామివారి సన్నిధిలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ ప్రమీల సత్పతి సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కొండగట్టులో ఆలయ ఈవో టంకశాల వెంకటేశం, స్థానాచార్యుడు కపీందర్, ధర్మపురిలో ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాకార మండపంలో ఆలయ అధికారులు శేషవస్త్రంతో సత్కరించగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో కొండగట్టు ఉప ప్రధానార్చకుడు చిరంజీవస్వామి, ఆర్ఐ తిరుపతి, దేవస్థానం వేదపండితుడు ముత్యాల శర్మ, ఉప ప్రధాన అర్చకుడు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అర్చకుడు నంబి నర్సింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులున్నారు.

### నర్సన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, డిసెంబర్ 4: ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామివారి సన్నిధిలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనర్సింహస్వామివారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లోని స్వామివారలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. బ్రాహ్మణులకు దీపదానాలు చేసుకున్నారు. భక్తులకు సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

# శరవేగంగా 'భోజనశాల'

- త్వరలో అందుబాటులోకి.. ● విద్యార్థులకు తొలగనున్న ఇబ్బందులు



రుద్రంగి మండల కేంద్రంలో చివరి దశకు చేరుకున్న భోజనశాల నిర్మాణ పనులు

రుద్రంగి, డిసెంబర్ 4: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటు మంచి భోజనం అందిస్తూ ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేసీఆర్ సర్కారు నిర్ణయం తీసుకుంది. సర్కారు బడిలో విద్యార్థుల కోసం భోజనశాల నిర్మాణం చేపట్టింది. మన ఊరు-మన బడికి రు ద్రంగి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. గతం లో టాయిలెట్, అదనపు గదులు, కిచెన్ షెడ్, సైన్స్ ల్యాబ్ వంటి అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనప్పటికీ మన ఊరు-మన బడిలో భాగంగా పాఠశాల అభివృద్ధికి ₹19 లక్షలను మం జూరు చేసింది. ఈ మేరకు భోజన శాల నిర్మించేందుకు ₹14 లక్షలను కేటాయించింది. ప్రస్తుతం భోజన శాల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. భోజనశాల పూర్తయితే విద్యార్థులు సౌకర్యంగా మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలు ఉం టుంది. దీంతో విద్యార్థులు ఇ బ్బందులు తొలగనున్నాయి. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాల అదనపు గదులు, సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి ₹46 లక్షల నిధులు మంజూరు చేశారు. అవి సరిపోకపోవడంతో జడ్పీ నిధుల నుంచి ₹15 లక్షల నిధులను అదనంగా నిధులు మంజూరు చేయించారు. ఉపాధి హామీలో భాగంగా ₹2 లక్షలతో మరుగుదొడ్డు, ₹2 లక్షల 50 వేలతో కిచెన్ షెడ్ నిర్మాణం చేపట్టారు. 370 మంది విద్యార్థుల ఉన్న ప్రభుత్వం పాఠశాలను అన్ని హంగులతో నిర్మించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భోజనశాలను త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సమ్మిరెడ్డి తెలిపారు.

## ఎంఐఎంపై బురద చల్లడం మానుకోవాలి

కలెక్టరేట్, డిసెంబర్ 4: ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన ప్రతిసారి ముస్లింలు, ఎంఐఎంపై బండి సంజయ్ బురద చల్లడం మానుకోవాలని ఎం ఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. నాలుగున్నరేళ్ల పదవీకాలంలో ఏనాడు ముస్లింల డివిజన్లలో పర్యటించకుండా, అభివృద్ధిపై దృష్టి సారించకుండా ఎంపీగా కొనసాగిన ఆయనకు ఎంఐఎం గురించి మాట్లాడే అర్హత లేదని విమర్శించారు. ముస్లింల అభివృద్ధిపై నిర్లక్ష్యం ప్రదర్శించిన ఆయనకు నగరంలోని మైనార్టీలు అదే రీతిలో బుద్ధిచెప్పారన్నారు. బండి నోటిదురుసుతనంతోనే ముస్లిం సమాజం ఒక్కటై బీఆర్‌ఎస్ వైపు నిలిచిందని స్పష్టం చేశారు. వక్ఫ్ భూమి, రేకుర్తిలో పేద ముస్లింల ఇండ్ల కూల్చివేతపై ఎంపీగా ఏనాడూ స్పందించలేదని మండిపడ్డారు. కరీంనగర్ అసెంబ్లీ పరిధిలో 40వేల ముస్లింలు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోగా, మిగతా 52వేల ఓట్లు ఎలా వచ్చాయో చెప్పాలన్నారు. కాంగ్రెస్‌కు పోలైన 40వేల ఓట్లు ఎవరివో గ్రహించాలని, అవగాహన లేకుండా ముస్లిం సమాజంపై కారుకూతలు కూయటం మానుకోవాలని హితవు పలికారు. తన ఓటమికి ఒక వర్గమే కారణమంటూ ఆరోపణలు చేయడం సముచితం కాదన్నారు. సెక్యులర్‌వాదంతో అన్ని వర్గాల ప్రజల మనసు చూరగొనడమే మొదటి విజయమనేది గుర్తెరగాలని సూచించారు.

## రాములోరి ఆలయంలో ప్రత్యేక భజనలు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 4: జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి శ్రీ సీతారామాలయంలో జిల్లాకు చెందిన నీలకంఠ భజన మండలి (మహి ళావిభాగం) కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక భజనలు చేశా రు. ఇక్కడ నీలకంఠ భజన మండలి గౌరవాధ్యక్షుడు గర్రెపెల్లి ఆంజనే యులు, అధ్యక్షురాలు మాధవి, ప్రధాన కార్యదర్శి పుష్పలత, సభ్యులు సం ధ్య, రజిత, కవిత, శారద, ఎజ్జు, శ్రీనివాస్, శ్రీధర్, సంగీత, సదానందం, స్వామి, కమలాకర్, సుధాకర్, కొమురవెల్లి, రవీంద్రచారి పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి క్యాలెండర్ ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 4: జిల్లా కేంద్రంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం ఆలయ మాజీ ఈవో ప్రసాదరావు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ అర్చకుడు రాజేశ్వరశర్మ, అయ్యప్ప సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, ఈవో కాంతారెడ్డి, గురుస్వాములు సత్యనారాయణ, రవీంద్రనాయక్, ఆంజనేయులు, శ్రీనివాస్, రవీందర్, నవీన్ పాల్గొన్నారు.

## ఎంఐఎం శ్రేణులకు ఓవైసీ అభినందన



అసదుద్దీన్ ఓవైసీతో మాట్లాడుతున్న గులాం అహ్మద్‌హుస్సేన్

కలెక్టరేట్, నవంబర్ 4: కరీంనగర్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ గెలుపునకు కృషి చేసిన ఎంఐఎం శ్రేణులను ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ అభినందించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయం దారుసలాంలో ఓవైసీని నగరంలోని ఎంఐఎం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితంపై ఓవైసీకి గులాం అహ్మద్ వివరించారు. అనంతరం మున్సిపల్ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన విధానంపై చర్చించారు. రాబోయే ఎన్నికల్లో 35 స్థానాల్లో పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఉద్బోధించినట్లు గులాం అహ్మద్ వెల్లడించారు. అనంతరం ఏడుగురు ఎంఐఎం ఎమ్మెల్యేలను సన్మానించారు. ఇక్కడ ఎంఐఎం జాయింట్ సెక్రటరీ హఫీజ్‌సయ్యద్ మొయిజొద్దీన్‌ఖాద్రీ, ఫసియుద్దీన్‌ఖాలిద్, షకీల్ ఉన్నారు.